## వర్ధన్నపేట 3వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఎండి. అప్సర్‌కు ఆర్ ఎస్ పి, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల భారీ మద్దతు..



**వర్ధన్నపేట/ఫిబ్రవరి7(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మమ్మద్ అప్సర్‌కు వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల నుండి అనూహ్య మద్దతు లభిస్తోంది. శనివారం వర్ధన్నపేట కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ ,పలు ప్రజా సంఘాల నాయకులు అప్సర్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటించారు.ఈ సందర్భంగా ఆర్ ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు ఈరేలి శ్రీనివాస్, ప్రజాసంఘాల రాష్ట్ర కన్వీనర్ మరుపట్ల అంజయ్య మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా, ఎలాంటి పదవులు ఆశించకుండా ప్రజల పక్షాన పోరాడుతున్న వ్యక్తి అప్సర్ అని వారు కొనియాడారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపించే అప్సర్ సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు.

## అనాథ స్థితిలో ఉన్న కుటుంబానికి అండగా శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి/ఫిబ్రవరి 7 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు గిద్దె యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం అనాథ స్థితిలో నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా కల్పించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలిచి 50 కిలోల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను అందజేశారు. కష్టసమయంలో మానవతా దృక్పథంతో సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఫౌండేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, ఈదురు యాకయ్య, ఈదునూరి స్వామి, గిద్దె సోమయ్య, గిద్దె అంజయ్య, మాడిపెల్లి కుమార్, యాకన్న, అశోక్, ప్రవీణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీల ప్రారంభం



**రాయపర్తి/ఫిబ్రవరి 7 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో కిషన్, తహసిల్దార్ శ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ గారే సహేంద్రభిక్షపతి, పాఠశాల ఉపాధ్యాయులు గారే కృష్ణమూర్తి సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు హితవు పలికారు. క్రీడల్లో ప్రతిభ చూపితే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ మండల ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు పి.డి. కొమ్ము శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్, వీరభద్ర శర్మ, పీడీలు నాగరాజు, సమ్మయ్య, అన్వర్, నరేష్, సందీప్, రామమూర్తి, రమేష్, సురేందర్, పంచాయితీ కార్యదర్శి వినోద్ కుమార్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొమ్మినేని వెంకటయ్యకు నివాళులర్పించిన వివిధ పార్టీల నాయకులు



**తల్లాడ/ఫిబ్రవరి 7 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన కొమ్మినేని వెంకటయ్య ఇటీవల మృతి చెందారు. శనివారం గ్రామంలో ఆయన దశదినకర్మను నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కొత్త వెంకటగిరి గ్రామ సర్పంచ్ దీవెల వెంకటేశ్వరావు, గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు, తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కూచిపూడి వెంకటయ్య, పొన్నం కృష్ణయ్య తదితరులు హాజరై వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి పట్ల కొమ్మినేని వెంకటయ్య చేసిన సేవలను వారు స్మరించుకున్నారు.నివాళులర్పించిన వారిలో కొత్త వెంకటగిరి ఉపసర్పంచ్ చారి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# 11వ వార్డు అభ్యర్థి గెలుపే లక్ష్యం

**వర్ధన్నపేట/ఫిబ్రవరి7(జర్నలిస్ట్ వార్త);**

11వ వార్డు అభ్యర్థి గెలుపే లక్ష్యం ప్రచారం చెయ్యడం జరుగుతుందని మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు. శనివారం వర్ధన్నపేట 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఈగ దామోదర్ విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించాయి.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి చేయి గుర్తుకు ఓటు వేసి దామోదర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు.ఎద్దు సత్యం,వర్ధన్నపేట బ్లాక్





కాంగ్రెస్ అధ్యక్షుడు.అబిడీ రాజ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.పోశాల వెంకన్న గౌడ్,ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు.రాయసురం సాంబయ్య, లింగం రజిత రెడ్డి, ఐనవోలు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకార సాంబయ్య, మహిళా నాయకురాలు ఇల్లందల ఎలీషా, తోట శ్రీను, తోటకూరి కార్తీక్, నోముల శ్యామ్, సంపంగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథంపై సదస్సు

## భౌతికవాదంఆదర్శవాదంపై అవగాహన

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 7 (జర్నలిస్ట్ వార్త):** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే దిశగా ఫిబ్రవరి నెల సైన్స్ కార్యక్రమాల్లో భాగంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో "భౌతికవాదంఆదర్శవాదం" అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు సురేష్ సమన్వయకర్తగా నిర్వహించారు.

ఈ సదస్సులో కీలక ఉపన్యాసం చేసిన ధర్మసాగర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ భౌతిక రసాయన శాస్త్రంలో పునరావృత ధర్మాన్ని కనుగొన్న శాస్త్రవేత్త డి. మిత్రు మెండలీవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ సదస్సు



నిర్వహిస్తున్నామని తెలిపారు. అప్పటివరకు తెలిసిన 63 మూలకాలను వాటి పరమాణు బరువుల పెరుగుదల క్రమంలో శాస్త్రీయంగా క్రమబద్ధీకరించడం ద్వారా మెండలీవ్ ఆధునిక పునరావృత పట్టిక అభివృద్ధికి బలమైన పునాది వేశారని వివరించారు.ఈ పరిశోధనల ఫలితంగానే మందులు, ఎరువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి అనేక శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు సాధ్యమై మానవ జీవితానికి విస్తృతంగా ఉపయోగపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రకృతిని కేవలం పంచభూతాలకే పరిమితం చేయకుండా పదార్థాల అసలు స్వరూపాన్ని శాస్త్రీయంగా అవగాహన చేసుకుని, మానవ సంక్షేమానికి విజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలనేదే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని ధర్మ ప్రకాష్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ, రమ్యశ్రీలతో పాటు విద్యార్థులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# చేతి గుర్తుకు ఓటేయండి

## జిల్లెల్ల స్వాతిని గెలిపించండి

## కాంగ్రెస్ నేతల పిలుపు

**కల్లూరు/ఫిబ్రవరి 7 (జర్నలిస్ట్ వార్త):**

కల్లూరు మున్సిపాలిటీలోని ఒకటవ వార్డు కౌన్సిలర్‌గా బరిలో ఉన్న కప్పలబంధం గ్రామానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి జిల్లెల్ల స్వాతి విజయం ఖాయమని తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, తల్లాడ మాజీ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పొట్టేటి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జిల్లెల్ల స్వాతికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే అభ్యర్థిగా ఆమెను గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఓటరిపై ఉందని పిలుపునిచ్చారు.కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని





ఒకటవ వార్డు ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి, చేతి గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో రాజకీయ అనుభవజ్ఞులైన పొట్టేటి జనార్దన్ రెడ్డి, అన్నం కోటిరెడ్డి, జిల్లెల్ల కృష్ణారెడ్డి, పిచ్చి రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, నారాయణరెడ్డి, గోపిరెడ్డి, లక్కిరెడ్డి, షేక్ సుభాని, వెంకటకృష్ణ, యుగంధర్ తదితరులు పాల్గొని ప్రజలను సమావేశపరుస్తున్నారు.ప్రజలతో మమేకమై, రాజకీయ మెలకువలతో సాగుతున్న ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంటోందని, తమకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి జిల్లెల్ల స్వాతిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# క్రీడా విజేతలను తీర్చిదిద్దే వేదిక 'సీఎం కప్'

## సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి -నియోజకవర్గ స్థాయి క్రీడల ప్రారంభం





**సత్తుపల్లి/ఫిబ్రవరి 7 (జర్నలిస్ట్ వార్త):**

పల్లె స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేదిక 'సీఎం కప్' అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పేర్కొన్నారు.

శనివారం సత్తుపల్లి మండలం గంగారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో సీఎం కప్ క్రీడలను ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నక్క రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలోని క్రీడా ప్రతిభను వెలికి తీసి, జిల్లా, రాష్ట్ర స్థాయిలకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం కప్ క్రీడలను ప్రవేశపెట్టారని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఎంఈఓ నక్క రాజేశ్వరరావు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణతో పాటు సమగ్ర మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు సమానంగా అవసరమని ఆయన సూచించారు.

**లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోజన సౌకర్యం**

సత్తుపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్ ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడలకు హాజరైన సుమారు 900 మంది క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించారు. సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు మండలాల నుంచి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు ఈ క్రీడల్లో పాల్గొన్నారు.

ఈ భోజన ఏర్పాట్లకు దూదిపాళ్ల రాంబాబు, సత్తుపల్లి కోల్ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు, బచ్చు శ్రీనివాస్, గుండు ప్రసాద్, పోరుపల్లి రాంప్రసాద్, ప్రసాద్ రెడ్డి, బాల నాగేశ్వరరావు, ఉమామహేశ్వర్ రెడ్డి, మండపాటి ప్రభాకర్ రెడ్డి సహకరించారు.

# ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే సత్తుపల్లి రూపురేఖలు మారతాయి

## 1వ వార్డు బీజేపీ అభ్యర్థి చీకటి వసంతరావు



**సత్తుపల్లి/ఫిబ్రవరి 7 (జర్నలిస్టు వార్త):**
సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒకటవ వార్డు నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చీకటి వసంతరావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. విద్యావంతుడైన వసంతరావుకు వార్డు సమస్యలపై పూర్తి అవగాహన ఉండటంతో పాటు సుదీర్ఘకాలంగా పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేయడం వల్ల సత్తుపల్లి ప్రజలతో మంచి పరిచయాలు ఉండటంతో వార్డు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వసంతరావు మాట్లాడుతూ తనను గెలిపిస్తే వార్డులోని ప్రతి సమస్యకు పూర్తి బాధ్యతతో పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. నోటుకు అమ్ముడుపోతే ప్రశ్నించే హక్కు కోల్పోతారని ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగిస్తేనే ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల సేవకుడిగా పనిచేస్తానని అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో కేంద్ర మంత్రుల సహకారంతో సత్తుపల్లి మున్సిపాలిటీకి భారీగా నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఏఎంఆర్‌యూటీ పథకం ద్వారా ప్రతి ఇంటికి పైప్‌లైన్ నీరు అందించడంతో పాటు వాటర్ ట్యాంకుల ఆధునీకరణ కొత్త బోర్లు ఫిల్టర్ ప్లాంట్ల ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేంద్ర మరియు ఫైనాన్స్ కమిషన్ నిధులతో అన్ని కాలనీల్లో డ్రైనేజీతో కూడిన సిమెంట్ రోడ్లు నిర్మించి గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తామని అన్నారు. స్వచ్ఛ భారత్ మరియు ఏఎంఆర్‌యూటీ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువల విస్తరణ వర్షపు నీటి నిర్వహణ చేపట్టి వరదల సమస్యకు ముగింపు పలుకుతామని హామీ ఇచ్చారు.

ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ద్వారా పట్టణ పేదలకు ఇళ్లు గృహ నిర్మాణ సబ్సిడీ స్లమ్ అభివృద్ధి చేపట్టి పేదోడికి సొంత ఇల్లు బీజేపీ గ్యారంటీగా నిలుస్తుందని తెలిపారు. కేంద్ర నిధులతో చెత్త సేకరణ వ్యవస్థ డస్ట్‌బిన్లు చెత్త శుద్ధి కేంద్రాలు పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేసి శుభ్రమైన సత్తుపల్లి నిర్మిస్తామని అన్నారు. కేంద్ర పథకాలతో ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్లు స్మార్ట్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి వీధికి వెలుగు తీసుకొస్తామని చీకటి కాదు అభివృద్ధి వెలుగు అని పేర్కొన్నారు. ఎన్‌యూఎల్‌ఎం పథకం ద్వారా యువతకు స్కిల్ ట్రైనింగ్ స్వయం ఉపాధి చిన్న వ్యాపారాలకు రుణాలు అందించి ఉద్యోగాలు మాటల్లో కాదు చేసి చూపే పనుల్లో ఉంటాయని తెలిపారు. అలాగే కేంద్ర పథకాల ద్వారా అర్బన్ హెల్త్ సెంటర్లు అంగన్‌వాడీలు డిజిటల్ సేవలు విస్తరించి ఆరోగ్యం విద్యను అభివృద్ధి పునాదిగా మార్చుతామని అన్నారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే కేంద్ర ప్రభుత్వ నిధులను సత్తుపల్లికి తీసుకొచ్చి ఈ మున్సిపాలిటీని తెలంగాణలో ఆదర్శ పట్టణంగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఈ ప్రచార కార్యక్రమంలో సత్తుపల్లి బీజేపీ పార్టీ కన్వీనర్ భస్కరన్నీ వీరం రాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధికి వేల కోట్ల నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. ఈ నిధులను సత్తుపల్లికి సమర్థంగా తీసుకొచ్చి






ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్ ప్రభరీ మధుసూదన్ జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా జిల్లా కార్యదర్శి పాల నాగ సురేందర్ రెడ్డి ఒకటవ వార్డు ఇన్‌చార్జ్ సత్తుపల్లి రూరల్ బీజేపీ మండల అధ్యక్షులు శాలి శివ జిల్లా నాయకులు మెరుగు శేషగిరిరావు మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ లక్ష్మి శిరీష రామారావు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబులెన్స్ ప్రారంభించిన అధికారులు



**ఖమ్మం/ఫిబ్రవరి7(జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఈ. శ్రీనివాస చారి సత్తుపల్లి డివిజన్‌కు కేటాయించిన విద్యుత్ అంబులెన్స్ (ఈఆర్‌టీ వెహికల్)ను శనివారం అధికారికంగా ప్రారంభించారు. విద్యుత్ సరఫరాలో తలెత్తే అత్యవసర పరిస్థితులను వేగంగా ఎదుర్కొనే లక్ష్యంతో ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ ఈ. శ్రీనివాస చారి మాట్లాడుతూ విద్యుత్ లైన్లలో బ్రేక్‌డౌన్‌లు, సాంకేతిక లోపాలు తలెత్తిన సమయంలో తక్షణ చర్యలు తీసుకునేందుకు ఈ ఈఆర్‌టీ వెహికల్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ వాహనంతో పాటు నియమితులైన ఆరుగురు సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ, వినియోగదారులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ పరిధిలో కూడా విద్యుత్ అంతరాయాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ సేవలు పనిచేస్తాయని, తద్వారా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ డీఈ ఎల్. రాములు, తల్లాడ ఏడీఈ ఎన్. సతీష్‌తో పాటు ఇతర విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతులకు నూతన యూరియా పంపిణీ యాప్ అవగాహన.

### -వ్యవసాయ అధికారి కే.రాజు.

**బయ్యారం/ఫిబ్రవరి 7(జర్నలిస్ట్ వార్త);**



బయ్యారం మండలంలోని అత్యంత దూర ప్రాంత గ్రామమైన మొట్ల తిమ్మాపురం గ్రామ రైతులకు నూతన యూరియా పంపిణీ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసే విధానం, అవసరమైన వివరాల నమోదు, ఎదురయ్యే సమస్యల పరిష్కార మార్గాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మొట్ల తిమ్మాపురం సర్పంచ్ బిజ్జా సాంబారావుకి యూరియా యాప్ వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనతో శిక్షణనిచ్చారు. యాప్ వినియోగంపై అవగాహన లేని రైతులకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొట్ల తిమ్మాపురం గ్రామం నుండే రైతులకు కంబాలపల్లి యూరియా పంపిణీ కేంద్రంకు సంబంధించిన యాప్ ద్వారా యూరియా సంచుల బుకింగ్‌ను ప్రత్యక్షంగా చూపించడం జరిగిందన్నారు. బయ్యారం మండలం రైతులకు తెలియజేయినది ఏమనగా ఈ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకొనుటకు శుక్రవారం నుంచి బయ్యారం,గార్ల,మహబూబాబాద్ మండలాలను కలిపి ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేశామన్నారు. కావునా రైతు సోదరులు ఈ మూడు మండలాల్లో ఉన్న ఎరువుల షాపుల్లో ఈ మూడు మండలాల రైతులు మాత్రమే యూరియా కొనుగోలు చేయడానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అఖిల్ పాల్గొని రైతులకు పూర్తి సహకారం అందించారు.

# మీ సేవ సెంటర్లలో అదనపు రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు.

### -తహశీల్దార్ నాగరాజు.



**బయ్యారంఫిబ్రవరి 7(జర్నలిస్ట్ వార్త);**
మండలంలో మీసేవ కేంద్రాల్లో నిర్వాహకులు అదనంగా రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బయ్యారం మండల తహశీల్దార్ నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మీసేవ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మీ సేవ కేంద్రంలో ధరల పట్టిక ప్రకారం రుసుము తీసుకోవాలని,అదనంగా తీసుకున్నట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు. దరఖాస్తులు స్వీకరించిన సమయంలో అన్ని దస్తావేజులు,పత్రాలను పరిశీలించి అప్లోడ్ చేయాలని సూచించారు. సర్టిఫికెట్లు ఇప్పిస్తానని దళారులు చెప్పే మాటలను నమ్మొద్దని అన్నారు.

# త్రివేణి స్కూల్‌లో ఘనంగా 16వ ఫన్ ఫెస్ట్ వేడుకలు

## విద్యార్థుల నృత్యాలతో అలరించిన కార్యక్రమం








సత్తుపల్లి/ఫిబ్రవరి 7 (జర్నలిస్ట్ వార్త):
సత్తుపల్లి పట్టణంలోని త్రివేణి స్కూల్‌లో 16వ ఫన్ ఫెస్ట్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల డైరెక్టర్ వై. యార్లగడ్డ వెంకటేశ్వరరావు హాజరుకాగా, సత్తుపల్లి సెషన్స్ జడ్జి ఎం. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారుల నుంచి సీనియర్ విద్యార్థుల వరకు చేసిన ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత, క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, కిడ్స్ ఇన్‌చార్జ్ శ్రీ పద్మ, అకాడమిక్ ఇన్‌చార్జ్ పవన్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సీఆర్ఓ మురళీకృష్ణ విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఫన్ ఫెస్ట్ వేడుకలను విద్యార్థులు ఆనందోత్సాహాలతో, హర్షాతిరేకాలతో జరుపుకోవడంతో త్రివేణి స్కూల్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# బయ్యారం మండల కేంద్రంలో అక్రమంగా జెసిబి,ట్రాక్టర్ లతో ఇసుక తోలకాలు.



**బయ్యారం/ఫిబ్రవరి 7(జర్నలిస్ట్ వార్త);**



బయ్యారం మండల కేంద్రంలోని కొంత మంది పాలవాగు నుండి ఇసుక అక్రమార్కులు జెసిబిల సహాయంతో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దామర చెరువు రోడ్ లోని పాలవాగు నుండి జెసిబి ల సహాయంతో ఇసుకను ట్రాక్టర్లకు నింపి తోలకాలు నిర్వహిస్తున్నారని దీనితో వాగులోని ఇసుకను తొడడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై తాహశీల్దార్ నాగరాజును వివరణ కోరగా మండల కేంద్రంలో ఎవరికి ఇసుక అనుమతులు ఇవ్వలేదని ఎవరైనా వాగుల నుండి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ఔటర్ బయట వరకు హైడ్రాను విస్తరించాలి

## ఫోన్‌ఇన్ కార్యక్రమంలో పలువురు వినతి

హైదరాబాద్,**ఫిబ్రవరి 7(జర్నలిస్ట్ వార్త);** ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగురోడ్డు బయట కూడా విస్తరించాలని పలువురు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. హైడ్రా కార్యాలయంలో తొలిసారి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి గంట వ్యవధిలో 36 మంది ఫోన్ చేసి భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితమవుతున్న తీరును వివరించారు. భూ ఆక్రమణదారులను ఉపేక్షించవద్దని హైడ్రాను కోరారు. తమ ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో మురుగు చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంలో అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులు, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురి అవుతున్నాయని, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నడక దారి లేకుండా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దుండిగల్ మున్సిపాలిటీలోని గాగిలాపూర్‌లో




రహదారులను ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రగతినగర్ వద్ద ఓ పార్కులో ఆలయం నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని, నాగిరెడ్డి కుంటలోకి మురుగు చేరకుండా చేపట్టిన డైవర్షన్ కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయని, మాదాపూర్‌లోని సున్నం చెరువు వద్ద పేరుకు వంద అడుగుల రహదారి ఉన్నా.. మొత్తం నీటి ట్యాంకర్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆయా ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్.. వారం వ్యవధిలో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి విడత 6 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే 14 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

